

నేడు జాబ్‌మేళా

వికారాబాద్, ఆగస్టు 22: జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, ఐటీఐ క్యాంపస్ వికారాబాద్ నందు నేడు(శుక్రవారం) ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్బాస్ సుభాన్ ప్రకటనలో తెలిపారు. ఫ్లిప్‌కార్టు సంస్థలో సుమారు 100 డెలవరీ ఎగ్జిక్యూటీవ్ పోస్టులు ఉన్నాయని వీటికి పదో తరగతి చదివిన పురుషులు అర్హులని తెలిపారు ఇతర వివరాలకు 976047444 నంబరులో సంప్రదించాలన్నారు.



వికారాబాద్‌లోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ



ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ(డైట్ కళాశాల) ప్రతిభ రోజు రోజుకు మసకబారుతోంది. ఇక్కడ తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియాల్లో కొనసాగుతున్న డైట్ కోర్సులో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో మొత్తం 225 మంది విద్యార్థులున్నారు. వారికి కేవలం ఏడుగురు గెస్ట్ లెక్చరర్లతో బోధన సాగుతోంది. ఇక్కడ మొత్తం 29 పోస్టులు ఉండగా.. ఒక్కరే రెగ్యులర్ అధ్యాపకుడు ఉండటం గమనార్హం. అన్ని సబ్జెక్టులు భోదించేవారు లేక సకాలంలో సిలబస్ పూర్తి కావడం లేదని శిక్షణ పొందుతున్న ఛాత్రోపాధ్యాయులు (స్టూడెంట్స్) ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ అధ్యాపకులను నియమించి బోధనలో అవాంతరాలు లేకుండా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉర్దూ మీడియానికి ముగ్గురే..

ఈ కళాశాలలో ఉర్దూ మీడియం బోధించేందుకు ముగ్గురు ఉపన్యాసకులు మాత్రమే ఉన్నారు. ఉర్దూ బోధించే వారు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఇక్కడ డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. మరో ఇద్దరు గెస్ట్ ఫ్యాకల్టీ ఉన్నారు. ఉర్దూ బోధించే లెక్చరర్లు లేక ఆ మీడియంలో డీఎడ్ శిక్షణ పొందుతున్న ఛాత్రోపాధ్యాయులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఉర్దూ మీడియం డీఎడ్ కోర్సులో కొనసాగుతున్న వారిలో ఉమ్మడి జిల్లా ఛాత్రోపాధ్యాయులే కాకుండా మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జహీరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన వారు సైతం ఉన్నారు. ఉర్దూ మీడియంలో బోధించేందుకు ఈ డైట్‌లో ఐదుగురు రెగ్యులర్ సీనియర్ ఉపన్యాసకులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నారు.

డైట్.. దయనీయం!

రెగ్యులర్ అధ్యాపకులు లేక ఇక్కట్లు

- తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూలో డైట్ కోర్సు
- మొత్తం 29 పోస్టులకు ఒక్కరే రెగ్యులర్
- 225 మందికి ఏడుగురే బోధనా సిబ్బంది
- ఇబ్బందుల్లో ఛాత్రోపాధ్యాయుల శిక్షణ
- గెస్ట్ లెక్చరర్లతోనే విద్యా బోధన
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

వికారాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ లెక్చరర్లు లేక ప్రభుత్వ విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో శిక్షణ పొందుతున్న ఛాత్రోపాధ్యాయుల(స్టూడెంట్స్) శిక్షణ అగమ్యగోచరంగా మారింది. భావి తరాలను సుశిక్షితులైన దేశ పౌరులుగా తీర్చిదిద్దే ఛాత్రోపాధ్యాయులకు బోధించే అధ్యాపకులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో శిక్షణ అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. సబ్జెక్టుల వారీగా సరిపడా అధ్యాపకులు లేక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయులుగా నియామకమైన తర్వాత తరగతి గదుల్లో విద్యార్థులకు చదువులు చెప్పాల్సిన వారి(డైట్ స్టూడెంట్స్) చదువులు ఈ విధంగా కొనసాగితే ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకం పోతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొత్తం సీట్ల సంఖ్యం 300

ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్ కళాశాల) వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఉంది. ఈ కళాశాలలో డీఎడ్ కోర్సు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియాల్లో కొనసాగుతోంది. ఒక్కో మీడియంలో 50 మంది విద్యార్థుల చొప్పున ఏటా 150 మందిని చేర్చుకుంటున్నారు. ఈ కళాశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరాలు కలిపి మొత్తం 300 మంది ఛాత్రోపాధ్యాయులకు ప్రాథమిక విద్యా బోధనలో శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, ప్రస్తుతం 225 మంది ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నారు. సరిపడా ఉపన్యాసకులు(లెక్చరర్లు) లేక ఛాత్రోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యా శిక్షణలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న వికారాబాద్ డైట్‌లో రెగ్యులర్ లెక్చరర్లు లేక క్రమంగా తన ఖ్యాతిని కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. రెగ్యులర్ అధ్యాపకుల నియామకమైతేనే డైట్‌కు పూర్వవైభవం వచ్చే పరిస్థితి ఉంది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులు కోరుతున్నారు.

తొమ్మిది మంది నియామకానికి అనుమతి

డైట్ కళాశాలలో మొత్తం 29 పోస్టులు ఉండగా.. ఒక్కరు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియాల్లో ఛాత్రోపాధ్యాయులకు విద్యా బోధన చేసేందుకు ఒక ప్రిన్సిపాల్ పోస్టుతో పాటు ఏడుగురు సీనియర్ లెక్చరర్లు, 16 మంది లెక్చరర్లు, 5 మంది ఉర్దూ మీడియం లెక్చరర్లు అవసరం. అయితే ప్రస్తుతం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఒక్కరు మాత్రమే రెగ్యులర్ సీనియర్ లెక్చరర్‌గా ఉన్నారు. ఆయన ఛాత్రోపాధ్యాయులకు విద్యా బోధనతో పాటు ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల వరకు డైట్‌లో ఇద్దరు సీనియర్ అధ్యాపకులు ఉండగా, గత నెలలో ఒకరు ఉద్యోగ విరమణ చేయగా, ప్రస్తుతం ఒక్కరు మాత్రమే రెగ్యులర్ అధ్యాపకుడు ఉన్నారు. ఛాత్రోపాధ్యాయులకు విద్యాబోధనలో ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఏడుగురు రిటైర్డ్ డైట్ ప్రిన్సిపాళ్లు, సీనియర్ ఉపన్యాసకులను గెస్ట్ ఫ్యాకల్టీ కింద నియమించి విద్యా బోధన కొనసాగిస్తున్నారు. ఈ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ కింద తొమ్మిది మందిని నియమించుకునేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. 9 పోస్టులకు అర్హులైన అతిథి అధ్యాపకుల నియామకం కోసం ఇటీవల ప్రిన్సిపాల్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

కోలుకుంటున్న కల్తీకల్లు బాధితులు

- మూడు రోజులుగా పీరంపల్లిలో హెల్త్ క్యాంప్
- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పల్వాన్‌కుమార్



హెల్త్ క్యాంపులో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పల్వాన్ కుమార్

వికారాబాద్, ఆగస్టు 22: పీరంపల్లి గ్రామంలో కల్తీకల్లు తాగి అనారోగ్యానికి గురైన బాధితులు క్రమంగా కోలుకుంటున్నారని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పల్వాన్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని పీరంపల్లి గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపులో వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులుగా గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో 38మందికి ప్రాథమిక చికిత్సలు చేశామన్నారు. వారిలో 11మందికి వివిధ పరీక్షల నిమిత్తం రక్త నమూనాలు సేకరించినట్లు తెలిపారు. ఇద్దరిని వికారాబాద్ జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశామన్నారు. గ్రామంలో కేసులు పూర్తిగా తగ్గేంతవరకు హెల్త్ క్యాంప్ కొనసాగుతుందని తెలిపారు. గ్రామప్రజలు చిన్నచిన్న జాగ్రత్తలు పాటించి అనారోగ్యానికి గురికాకుండా ఉండవచ్చని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, రోడ్లపై బహిరంగంగా లభించే చిరుతిళ్లు తినరాదని, తినే ఆహార పదార్థాలపై మూతలు పెట్టి ఉంచాలని సూచించారు. వేడి వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలని తెలిపారు. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. గ్రామంలోని ప్రజలు ఎవరూ అధైర్య పడకుండా ఏమాత్రం అనారోగ్యంగా అనిపించినా వెంటనే గ్రామంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. హెల్త్ క్యాంపులో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, అవసరమైతే జిల్లా ఆస్పత్రికి తరలించడానికి 108సేవలను వినియోగించుకోవాలని సూచించారు.



మొక్క నాటుతున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

- ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

దౌల్తాబాద్, ఆగస్టు 22: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మండల ప్రత్యేకాధికారి, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి కోరారు. 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరుపై' అనే కార్యక్రమంలో భాగంగా గురువారం దౌల్తాబాద్ మండలంలోని మాటూర్‌లో ఆమె మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించే బాధ్యతను తీసుకుంటే రాబోయే తరాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీవో రజనీకాంత్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



కులకచర్లలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

భగ్గుమన్న బీఆర్ఎస్

రైతులందరి రుణమాఫీకి డిమాండ్ ▸ రెండు జిల్లాల్లో భారీగా నిరసనలు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ బేషరతుగా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో గురువారం బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఈ మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. -ఆంధ్రజ్యోతి నెట్వర్క్



ఘట్‌కేసర్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్ రావు

తాండూరు, ఆగస్టు 22: ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా సవరించేందుకు రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌రావు కోరారు. తాండూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా రాజకీయ నాయకుల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్పెషల్ సమ్మరీ రీవిజన్ -2024లో భాగంగా సవరణలు చేపట్టనున్నట్లు తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్నవారు శాశ్వతంగా ఎక్కడైనా వెళ్లిపోయారా? మృతిచెందిన వారి పేర్ల తొలగింపు, 18 సంవత్సరాలు నిండిన యువతీయువకుల పేర్లు నమోదు చేసుకునేందుకు, కొత్తగా పెళ్లి అయిన వారిపేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ జాబితా ప్రకటించిన తర్వాత అభ్యంతరాలు, సవరణ, పరిశీలనకు అవకాశముందని చెప్పారు. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారని ఆయన వెల్లడించారు. ఇప్పటి వరకు ఓటుహక్కు లేని వారు ఫారం-6 ద్వారా దరఖాస్తును ఆన్‌లైన్‌లోగానీ, బీఎల్‌వోల వద్దగానీ నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఈ సమావేశంలో తాండూరు తహసీల్దార్ తారాసింగ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పట్లోళ్ల బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సలీం, బీజేపీ నాయకులు బంటారం భద్రేశ్వర్, కౌన్సిలర్ సోమశేఖర్, అధికారి చంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

18 కేజీబీవీలలో బదిలీలు

- జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి



వికారాబాద్, ఆగస్టు 22: జిల్లాలోని 18 కేజీబీవీలలో కాంట్రాక్టు పద్ధతి ద్వారా పని చేస్తున్న ఎస్‌వో, పీజీ సీఆర్‌టీ, సీఆర్‌టీ, పీఈటీ, ఏఎన్ఎం, అకౌంటెంట్‌లను ఇతర కేజీబీవీలకు బదిలీ చేసేందుకు రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ద్వారా ఉత్తర్వులు అందాయని డీఈఓ రేణుకాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. http://schooledu.telangana.gov.in/isms వెబ్‌సైట్ ద్వారా ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో కొత్త జిల్లాల ప్రాతిపదికన జరిగే ఈ బదిలీల్లో రెండేళ్లు ఒకే కేజీబీవీలో సర్వీస్ పూర్తయిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ నేటి(ఆగస్టు 22) నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణతో ప్రారంభమై సెప్టెంబర్ 5న ముగుస్తుందన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

మా గ్రామాలను 'బీబీనగర్'లో కలపొద్దు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 22 : తమ గ్రామాలను యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలంలో కలపొద్దని అఖిలపక్ష నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతి అందజేశారు. అవుశాపూర్, అంకుషాపూర్, మాధారం గ్రామాల అఖిలపక్ష నాయకులు నగరంలోని మంత్రి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాలను మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ మండలంలోనే కొనసాగించాలని, ఆయనను కోరారు. ఇతర జిల్లాలో కలిపితే తమ గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని వారు మంత్రికి వివరించారు. అనంతరం మరో మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ఏనుగు మశ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సల్మాన్, కరుణాకర్, మహేష్, ప్రవీన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటిపై గంపెడాశలు



- ఇందిరమ్మ ఇళ్లకు లక్షకు పైగా దరఖాస్తులు
- తెరుచుకోని ప్రజాపాలన వెబ్‌సైట్
- దరఖాస్తు చేసేందుకు అర్హుల ఎదురుచూపులు
- నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయిస్తామన్న ప్రభుత్వం
- ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షల ఆర్థిక సాయం

మేడ్చల్ ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని అర్హులైన పేదలందరికీ ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పేరుతో నూతన పథకాన్ని ప్రకటించింది. గతేడాది డిసెంబరు 28 నుంచి ఈ ఏడాది జనవరి 6 వరకు జిల్లా వ్యాప్తంగా ఇందుకు అర్హులైన వారిని నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క త్వరలో తొలివిడతగా ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రకటించని మార్గదర్శకాలు

ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొత్తం జిల్లాలో 5 నియోజకవర్గాలకు గాను 17,500 ఇళ్లు మొదటి దశలో మంజూరవనున్నాయి. ఒక్కో ఇంటికి ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ. 6 లక్షలు, ఇతర వర్గాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లా స్థాయిలో అధికారులు మాత్రం ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని పేర్కొంటున్నారు. ప్రజాపాలన వెబ్‌సైట్ ప్రస్తుతం తెరుచుకోకపోవడంతో అర్హులైన కొత్త దరఖాస్తుదారులు నిరాశకు లోనవతున్నారు. తమకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వేలల్లో ఇళ్లు... లక్షల్లో దరఖాస్తులు

ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రజాపాలన కింద దరఖాస్తులను స్వీకరించింది. సొంత స్థలం ఉండి ఇల్లు లేనటువంటి వారు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. మహిళ పేరున పథకం అమలు చేస్తామని ప్రకటించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం లక్షా పది వేల దరఖాస్తులు వచ్చాయి. నియోజకవర్గానికి మొదటి దశలో 3,500 చొప్పున 17,500 ఇళ్లు మంజూరు అవ్వనున్నాయి. ఈ లెక్కన ఒక్కో ఇంటికి 7 మంది దరఖాస్తుదారులు పోటీ పడుతుండగా ఇందులో అర్హుల ఎంపిక ఎలా అనే దానిపై అధికారులు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నారు.

'డబుల్' ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాలను జిల్లాలో పలు చోట్ల ప్రారంభించినప్పటికీ అక్కడక్కడ మాత్రమే అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మిగిలిన చోట్ల ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. కొన్ని చోట్ల పూర్తయి లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ మౌలిక వసతులు లేని కారణంతో వారికి ఇళ్లు కేటాయించలేదు. వాటి నిర్మాణాలను కూడా త్వరగా పూర్తి చేసి అర్హులైన వారికి ఇవ్వాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

కేశంపేట, ఆగస్టు 22: విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి పని భారాన్ని తగ్గించాలని జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు కస్నయ్య గారి గోవర్ధన్ డిమాండ్ చేశారు. గురువారం కేశంపేట,



ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గించాలి


సభ్యత్వం అందజేస్తున్న గోవర్ధన్‌యాదవ్

సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, పాపిరెడ్డిగూడ, వేముల్‌నర్వ, కొండారెడ్డిపల్లి, కాకునూర్, నిర్దవెల్లి, పీఎస్ కొండారెడ్డి గ్రామాల్లోని స్కూళ్లలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎక్కువున్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉందని, కొన్నిచోట్ల వందల్లో విద్యార్థులున్న చోట్ల టీచర్లు తక్కువ మంది ఉన్నారన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి టీచర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. డీఎస్సీకి ముందే రేష్నలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని అన్నారు. విద్యా వ్యవస్థలోని సమస్యలపై పీఆర్‌టీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కరుణాకర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్, విష్ణువర్ధన్‌రెడ్డి, జంగయ్య, హరి ప్రసాద్, గోవర్ధన్, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి


బొంరాస్‌పేట్, ఆగస్టు 22: గ్రామాల్లో నేరాల కట్టడికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. స్టేషన్‌లో నమోదైన వివిధ కేసులకు సంబంధించిన ఫైల్‌లను తనిఖీ చేశారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజలు గ్రామాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీకెమెరాల ఏర్పాటుతో ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు నేరస్తులను సులభంగా గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రోడ్డుప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలు, పోక్సో చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేస్తామని, ప్రతీఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అంతకు ముందు ఎస్పీ నారాయణరెడ్డి పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, బొంరాస్‌పేట్ ఎస్ఐ అబ్దుల్ రవూఫ్, ఏఎస్ఐ కమాల్ రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




















రేపు ఆర్వోఆర్ యాక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి: ప్రభుత్వం త్వరలో తీసుకురాబోతున్న కొత్త ఆర్వోఆర్ (రికార్డు ఆఫ్ రైట్స్)యాక్టు-2024పై శనివారం కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. కొత్తగా తీసుకువస్తున్న చట్టానికి సంబంధించిన ముసాయిదా ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసింది. దీనిపై ప్రజల నుంచి విస్తృత అభిప్రాయ సేకరణ జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్ర, శనివారాల్లో ఆయా జిల్లాల్లో స్థానిక పరిస్థితులను బట్టి నూతన రెవెన్యూ చట్టం ముసాయిదాపై వివిధ రంగాల మేధావులతో వర్క్‌షాపు నిర్వహించాలని కలెక్టర్లకు ఆదేశించింది. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో శనివారం కలెక్టరేట్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతున్నారు. రైతులు, రెవెన్యూ అధికారులు, మాజీ రెవెన్యూ అధికారులతో పాటు మేధావుల అభిప్రాయాలను కూడా తీసుకుంటారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలను కూడా ఆహ్వానించారు.

రేపు జాబ్‌మేళా

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22 : నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 24న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జయశ్రీ తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:30గంటల వరకు మేళా నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లో రిటైల్, ఈ-కామర్స్ బీపీవో రంగాల్లో పోస్టులు ఉన్నట్లు చెప్పారు. పదో తరగతి, డిగ్రీ, ఐటీఐ అండ్ డిప్లొమా, జీఎన్ఎం, ఎఎన్ఎం, బి-ఫార్మసీ పూర్తి చేసి ఉండాలన్నారు. వయస్సు 18 ఏళ్ల నుంచి 30ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. వివరాలకు 9063099306 ఫోన్ నంబర్లో సంప్రదించాలనా సూచించారు.

108లో నియామకాలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 22: ఈఎంఆర్ఐ (108) సంస్థలో డ్రైవర్లు, మెడికల్ టెక్నీషియన్లు నియామకాలను చేపడుతున్నట్లు ఈఎంఆర్ఐ ప్రోగామ్ మేనేజర్ షేక్ జాన్ షాహీద్ తెలిపారు. నియామకాల ఇంటర్వ్యూలు కింగ్ కోఠి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని తమ కార్యాలయంలో ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రైవర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోదలచిన వారి వయసు 23-35 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. మెడికల్ టెక్నీషియన్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోదలచిన అభ్యర్థులు 30 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. డీ ఫార్మసీ, నర్సింగ్‌తో పాటు ఇతర ఆరోగ్య శాఖకు సంబంధించిన డిప్లమా చదివి ఉండాలన్నారు. ఇంటర్వ్యూలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక జత జిరాక్స్ సెట్‌ను తీసుకురావాలని తెలిపారు.

తాండూరు మున్సిపల్ డీఈఈగా మణిపాల్

తాండూరు, ఆగస్టు 22: తాండూరు మున్సిపల్ డీఈఈగా మణిపాల్ గురువారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసిన ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా తాండూరు మున్సిపాలిటీకి బదిలీపై వచ్చారు. గతంలో పనిచేసిన డీఈ రంగానాథం మాతృశాఖకు బదిలీ అయ్యారు. ఆయన ఇక్కడ ఆరేళ్లు ఇన్‌చార్జి డీఈఈగా కొనసాగారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి



చెక్కు అందజేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 22 : పేదల ఆరోగ్య పరిరక్షణకు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వాలు పెద్ద పీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో గురువారం ఆయన పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గుండూరుకు చెందిన తిరుపతయ్యకు సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద అన్నిరకాల వైద్య చికిత్సలు అందించాలని కోరారు. వానకాలంలో వ్యాధులు ప్రబలుతున్నందున అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. నాయకులు నాగులు, సతీష్, సుభాష్, నర్సింహ, యాదగిరి, సుమన్, గణేశ్, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయానికి వైకుంఠ ద్వారం



షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 22 : షాద్‌నగర్‌లోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి అష్టలక్ష్మి ప్రతిమలతో వైకుంఠద్వారాన్ని ఏర్పాటు చేశారు. భక్తుల విరాళాలతో ఏర్పాటు చేసిన ఈ ద్వారాన్ని శుక్రవారం ఉదయం 8.35గంటలకు ప్రారంభిస్తారు. ఈ ఉత్సవాలకు భక్తులు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు కోరారు.

పకడ్బందీగా ఓటరు జాబితా తయారు చేయాలి



ఓటరు జాబితా సవరణపై సమీక్షిస్తున్న అధికారులు

బషీరాబాద్, ఆగస్టు 22: అర్హులైన ప్రతీఒక్కరికి చోటు కల్పిస్తూ ఓటర్ల జాబితా పకడ్బందీగా రూపొందించాలని బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంపీడీవో గాలి యాదయ్య అన్నారు. బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితా సవరణపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లతో వారు సమీక్షించారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటరు జాబితాలో పేరుండేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో సవరణ కోసం రాజకీయ పార్టీల నాయకులు తమ వంతుగా సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీవో బాలగంగాధర్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

సేవలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా శంకర్‌నాయక్




సేవలాల్‌సేన జిల్లా కార్యవర్గం వీరే

పరిగి, ఆగస్టు 22: సేవలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా కులకచర్ల మండలం దాస్యానాయక్‌తండా మాజీ సర్పంచి జటావత్ శంకర్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం పరిగిలోని సంతునిరంకారి సత్రంలో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రవినాయక్, ప్రధాన కార్యదర్శిగా సురేష్‌నాయక్, కార్యదర్శి మోహన్‌నాయక్, ఉపాధ్యక్షులుగా రాజునాయక్, వినోద్‌నాయక్, సేవలాల్ యువసేన జిల్లా అధ్యక్షుడు తిరుపతి, రైతుసేన జిల్లా అధ్యక్షుడు చంద్రనాయక్, ఉపాధ్యక్షుడు పాండు, పరిగి నియోజకవర్గం ఇన్‌చార్జిగా తులసీరామ్, జిల్లా సేవలాల్ ధర్మజాగరణ అధ్యక్షుడు కిషన్‌స్వామి, ఉపాధ్యక్షుడిగా కేశ్యానాయక్‌నాయక్, కోశాధికారిగా విష్ణునాయక్, కులకచర్ల మండల ఇన్‌చార్జి అంగూర్‌నాయక్, దోమ మండల ఇన్‌చార్జిగా సూర్యనాయక్, కొడంగల్ ఇన్‌చార్జిగా హరి, చౌడాపూర్ మండల ఇన్‌చార్జిగా అజయ్‌నాయక్‌లకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో గిరిజన సింహగర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచాయితీలుగా ఉన్న తండాల పరిధిలోని ఉద్యోగాలను గిరిజనులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

పల్లె పోరుకు సై

- ఓటర్ జాబితాలకు కసరత్తు
- వచ్చే నెలలో ప్రక్రియ
- తాండూరు సెగ్మెంట్‌లో 161 పంచాయతీలు
- కొత్త పంచాయతీల్లో ఎన్నికలపై లేని స్పష్టత



తాండూరు, ఆగస్టు 22: గ్రామపంచాయతీ వార్డు విభజన ప్రక్రియను ప్రభుత్వ అధికార యంత్రాంగం చేపట్టనుంది. ఇందుకుగానూ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాలో 20 ఫిబ్రవరి 2024 ఆమోదించబడిన ఫొటోలను ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఎలక్టోరల్ రోల్స్‌కు సంబంధించి ప్రక్రియను సెప్టెంబర్ 6 నుంచి చేపట్టాలని తాజాగా అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో గ్రామస్థాయిలో ఎన్నికల ప్రక్రియ ఊపందుకోనుంది. తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని పెద్దేముల్, యలాల, బషీరాబాద్, తాండూరు, కోట్‌పల్లి మండలాలు కలిపి 161గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీలలో ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చే నెల 6 నుంచి 21వ తేదీ వరకు ప్రక్రియను చేపట్టనున్నారు. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో ప్రక్రియకు సంబంధించి స్పష్టత లేదు. తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో కొత్తగా 12గ్రామ పంచాయతీలు ఏర్పడిన విషయం విధితమే. సెప్టెంబర్ 6న గ్రామపంచాయతీల ఎలక్టోరోల్స్ తయారీ, ప్రచురణ దశ, పంచాయతీలు, వార్డు డివిజన్‌ను సక్రమంగా సూచిస్తూ గ్రామపంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఓటరు జాబితా ప్రచురణ, 10న రాజకీయ పార్టీల ప్రతినిధులతో, ఎంపీడీవో స్థాయిలో అభ్యంతరాలపై సమావేశం, సెప్టెంబర్ 7 నుంచి 13వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, వార్డు, గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో అసెంబ్లీ ఓటర్ల అభ్యంతరాలు, సవరణలుంటాయి. 19న వచ్చిన అభ్యంతరాలపై సమీక్షించి తొలగిస్తారు. 21న వార్డు డివిజన్ సక్రమంగా సూచించే ప్రచురణతో ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మార్గం సుగమం అయినట్లు చెప్పవచ్చును. బీసీ రిజర్వేషన్ల ఓటర్ జాబితా ప్రకారం చేపడుతారా? లేదా? అన్నది స్పష్టం చేయాల్సి ఉంది.





బోనాలతో తరలుతున్న గ్రామస్తులు, బోనాల ఉరేగింపులో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూర్‌లో వైభవంగా పోచమ్మ బోనాలు

కొత్తూర్, ఆగస్టు 22: కొత్తూర్ మున్సిపాలిటీలో గురువారం రాత్రి మైసమ్మ బోనాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవతలను పునఃప్రతిష్ఠించి బోనాల పండుగను నిర్వహించారు. పెంజర్ల రోడ్డులోని మందోనిమైసమ్మ ఆలయం నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు మైసమ్మ ఆలయం వరకు ఉరేగింపు నిర్వహించారు. మహిళలు నెత్తిపై బోనాల పెట్టుకొని మేళతాళాల మధ్య ఆలయాలకు చేరుకున్నారు. కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బి.దేవేందర్‌యాదవ్, ఇందూరి శ్రీనివాస్ సొంత ఖర్చుతో పలహార బండిని ఏర్పాటు చేసి నైవేద్యం సమర్పించారు. ఊరేగింపులో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ నృత్యం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పూజల అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, కొత్తూరు, షాద్‌నగర్ మున్సిపల్ చైర్‌పర్సన్లు లావణ్యదేవేందర్‌యాదవ్, కె.నరేందర్, రాజకీయ పార్టీల నాయకులు సదానంద్‌గౌడ్, జె.సుదర్శన్‌గౌడ్, నర్సింహాగౌడ్, దేవేందర్, జె.శ్రీను, యాదయ్య, కృష్ణయ్య, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రవినాయక్, బి.కృష్ణ, రాఘవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్



విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న వెంకటయ్య, హరిప్రసాద్, రాము తదితరులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

ఆమనగల్లు, ఆగస్టు 22: ఆమనగల్లులోని కట్టమైసమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. మూడు రోజుల వేడుకలకు ఆలయ ఛైర్మన్ మొక్తాల వెంకటయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సురసముద్రం చెరువు కట్టపై కట్టమైసమ్మ ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ముదిరాజ్ సంఘం నాయకులు, మత్స్యకారులు, భక్తులు, మహిళలు ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల రెండోరోజు గురువారం అర్చకులు నాగభూషణం, శరత్‌చంద్ర, రామకృష్ణ శర్మల ఆధ్వర్యంలో షోడష స్తంభ పూజ, స్థాపితహవన పూజలు నిర్వహించారు. బాల బ్రహ్మాచార్యులు, బసవేశ్వరశాస్త్రి, నాగరాజుశర్మలు విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్, మాజీ ఎంపీపీ లలితవెంకటయ్య, సంఘ సేవకుడు రాముశ్వేత, ఎస్సై బి.వెంకటేశ్, కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, లక్ష్మణ్, నాయకులు ఎర్రవోలు యాదయ్య, చిన్న వెంకటయ్య, అంజయ్య, రాజు, శ్రీనివాస్, ఆంజనేయులు, మల్లేశ్, సాయి, మహేశ్, వెంకటేశ్, మల్లేశ్, శివ, బాలమణి, యాదమ్మ, వెంకటమ్మ, మల్లేశ్, రమేశ్, శ్రీశైలం, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మేడ్చల్ నూతన కార్యవర్గం



పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 22: పీఆర్‌టీయూ మేడ్చల్ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మధుసూధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గుర్రం రిజిత, అసోసియేట్ అధ్యక్షుడిగా జి.తవిటి నాయకుడు, ఉపాధ్యక్షులుగా వి.హరీష్, బి.లతశ్రీ, మహిళా కార్యదర్శిగా వెంకటరత్నం, కార్యదర్శిగా కె.జగదీప్, టి.హరీష్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వై.రామేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, మండలంలోని పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామీణ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ కృష్ణ

దోమ, ఆగస్టు 22: నిరుద్యోగ యువతీ యువకులు ఉచిత శిక్షణను వినియోగించుకోవాలని గ్రామీణ అభివృద్ధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జీఎస్ఆర్ కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారంఅంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, మహిళా సంఘాల సభ్యులకు సమావేశం నిర్వహించారు. యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి స్వర్ణభారతి ట్రస్టు ముచ్చింతల్‌లో 19-45 సంవత్సరాల్లోపు యువతీ యువకులు వివిధ కోర్సుల్లో అందిస్తున్న శిక్షణపై అవగాహన కల్పించారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు భోజనం, వసతి, దుస్తులను అందించడంతో పాటు శిక్షణ అనంతరం మినిస్ట్రీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 89198 56113 నెంబరుకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, వైద్యురాలు రజిత, సీహెచ్‌వో విజయలక్ష్మి, ప్రభులింగం, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఎస్ఐ సంతోష్

పరిగి, ఆగస్టు 22: మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని పరిగి ఎస్ఐ సంతోష్ అన్నారు. అంకిత సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని నస్కల్‌లోని కేజీబీవీ స్కూల్‌లో గురువారం మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా ఆకతాయిలు వేధించినా అనుమానితులుగా కనిపించినా 100 డయల్‌కు కాల్ చేయాలని సూచించారు. బాలకార్మికులు, బాల్యవివాహాల సమాచారాన్ని 1098కు తెలపాలన్నారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సాఫియాసుల్తాన్, సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.ప్రకాశ్, ఏహెచ్‌టీయూ అధికారి అలీమొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలి



ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై సమీక్షిస్తున్న ఆర్డీవో వెంకటమాధవరావు

షాద్‌నగర్, ఆగస్టు 22: ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిశీలను వేగవంతం చేయాలని షాద్‌నగర్ రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ వెంకటమాధవరావు అధికారులను ఆదేశించారు. గురువారం కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్‌కు 12వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్లాట్లను తనిఖీ చేసిన తర్వాతనే ఆయా దరఖాస్తులను ఉన్నతాధికారులకు సమర్పించాలన్నారు. ప్రభుత్వ, భూదాన్, శిఖం భూములేమైనా ఉన్నాయా? అని పరిశీలించాలని సూచించారు. అక్రమ వెంచర్లలోని ప్లాట్లను రెగ్యులరైజ్ చేయొద్దని అన్నారు. అలాగే షాద్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న చెరువులు, కుంటలను పరిరక్షించాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. నందిగామ మండలంలో 33, కొత్తూరులో 33, ఫరూఖ్‌నగర్ మండలంలో 34 చెరువులు, కుంటలు ఉన్నాయని తెలిపారు. అవి అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, నీటి పారుదుల, కొత్తూరు, షాద్‌నగర్ మున్సిపాలిటీల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని తెలిపారు.

కాలుష్యంతో కుర్వగూడ వాసుల ఇబ్బందులు



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

షాబాద్, ఆగస్టు 22: ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లికట్ట సమీపంలో ఉన్న కంపెనీల నుంచి వస్తున్న కాలుష్యం కుర్వగూడ గ్రామంపై ప్రభావం చూపుతోందని, కాలుష్యకారక కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కుర్వగూడ వాసులు గురువారం పంచాయతీ కార్యదర్శి పర్వీన్‌బేగంకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ... కుర్వగూడకు దగ్గరలో ఉన్న అనేక కంపెనీలతో గాలి, నీటి కాలుష్యం వస్తోందనన్నారు. ప్రమాదకర గ్యాస్‌లు, దుర్వాసనతో ప్రజలకు శ్వాసకోశ సంబంధిత సమస్యలు వచ్చాయన్నారు. నీరు రంగు మారి దుర్వాసన వస్తోందన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోయి కంపెనీలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాదె హరీష్, రాము, మల్లేష్, మహేష్, శ్రీనివాస్, అమరేష్, సునీల్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్ల డాక్యుమెంట్ల రెగ్యులరైజ్‌కు చర్యలు



దరఖాస్తులను పరిశీలిస్తున్న టీపీవో మణిహారిక, అధికారుల బృందం

శామీర్‌పేట, ఆగస్టు 22: 2020 వరకు లేఅవుట్లలో, వెంచర్‌లలో హెచ్ఎండీఏ అనుమతులు లేకుండా కొనుగోలుచేసి రెగ్యూలరైజ్ చేసుకోని అర్హత గల ప్లాట్లను రెగ్యూలరైజ్ చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తూంకుంట మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి (టీపీవో) మణిహారిక అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తూంకుంట మున్సిపల్ పరిధిలోని అంతాయిపల్లిలో గల ఎస్ఎన్ఆర్ వెంచర్‌లో మున్సిపల్ టీపీవో ల్యాండ్ రెగ్యూలరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల, డ్యాకుమెంట్ల పరిశీలన, విచారణ ప్రక్రియను(ఎల్ఆర్ఎస్ మేళా) ప్రారంభించారు. దీంతో ఎస్ఎన్ఆర్ వెంచర్‌లో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ మేళా వద్దకు తూంకుంట మున్సిపల్ పరిధిలో హెచ్ఎండీఏ అనుమతులు లేకుండా, రెగ్యూలరైజ్ చేయకుండా కొనుగోలు చేసిన పలువురు ప్లాట్ల యజమానులు వచ్చారు. ఈ ఎల్ఆర్ఎస్ మేళాను మున్సిపల్ టీపీఓ మణిహారిక ఆధ్వర్యంలో మండల అధికారుల బృందం మండల ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవ్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కవితలు నిర్వహించారు. కాగా మొదటిరోజు గురువారం మున్సిపల్ పరిధిలోని దాదాపు 25 మంది ప్లాట్ల యజమానులు తీసుకవచ్చిన 2020 వరకు దరఖాస్తులు చేసుకున్న ఎల్ఆర్ఎస్ డ్యాకుమెంట్లను టీపీవో అధికారుల బృందం క్షుణ్ణంగా విచారణ జరిపి పరిశీలించారు. అనంతరం ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న ప్లాట్లను కూడా టీపీవో నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా టీపీవో మణిహారిక మాట్లాడుతూ.. తూంకుంట మున్సిపల్ పరిధిలో 2020 వరకు దాదాపు 4853 మంది యజమానులు వివిధ వెంచర్లు, లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసినట్లు వివరించారు. ప్రభుత్వ నియమనిబంధనల మేరకు ఈ ప్లాట్లను మూడు దశల్లో అధికారుల బృందాలు ప్లాట్ల డ్యాకుమెంట్లను, ప్లాట్ల స్థలాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత గల ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ చేయనున్నట్లు టీపీవో వెల్లడించారు. తూంకుంట మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న ప్లాట్లను ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా తాము రెగ్యూలరైజ్ చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు టీపీవో తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం మున్సిపల్ పరిధిలో ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని టీపీవో వెల్లడించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్లాట్ల యజమానులు వినియోగించుకోవాలని టీపీఓ పిలుపు నిచ్చారు.

జీహెచ్ఎంసీలో విలీనాన్ని సవాల్ చేస్తూ పిటిషన్

శంషాబాద్ రూరల్, 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషరేట్ పరిధిని విస్తరించేందుకు తలంచింది. ఇందులో భాగంగా ఔటర్‌రింగ్ రోడ్డు పరిధి మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, పంచాయతీలను జీహెచ్ఎంసీలో వీలినం చేస్తున్నట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ జీవోను విడుదల చేశారు. దీన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం చిన్న గోల్కొండ మాజీ సర్పంచ్ పద్మావతిఅనంతరెడ్డి హమీదుల్లానగర్, పెద్ద గోల్కొండ, బహదూర్‌గూడ, రషీద్‌గూడ గ్రామాల తరపున హైకోర్టులో పిటిషన్ వేశారు. జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం ముందు పిటిషనర్ తరపున అడ్వకేట్ రఘునాథ్ గురువారం వాదనలు వినిపించారు. పంచాయతీల తీర్మానాలు లేకుండా జీహెచ్ఎంసీలో వీలినంతో రైతులు, రైతు కూలీలు కేంద్ర ప్రభుత్వ పథకాలకు దూరం అవుతారన్నారు. ఉపాధి హామీ వంటి పథకాలు వారికి వర్తించవని, ఉపాధిని కోల్పోతారని తెలిపారు. వాదనలపై జస్టిస్ వినోద్‌కుమార్ స్పందిస్తూ ప్రభుత్వం ఏకపక్షంగా జీవో విడుదల చేసినట్లు గుర్తించి, అధికారుల నుంచి వివరణ కోరారు. నాలుగు వారాల్లో కోర్టుకు వివరణ సమర్పించాలని ధర్మాసనం పేర్కొందని పిటిషనర్ల న్యాయవాది తెలిపారు.


వికారాబాద్: ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


పరిగి: తెలంగాణతల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి,నాయకులు


కొడంగల్: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ బేషరతుగా రూ.2లక్షల రుణ మాఫీ చేయాలన్నారు. లేదంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొడంగల్: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


మర్పల్లి: ధర్నాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మధుకర్, నాయకులు


మేడ్చల్ టౌన్: తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు


తాండూరు: తాండూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న రాష్ట్ర నాయకులు శ్రీశైలరెడ్డి, రాజు గౌడ్, తదితరులు


మోమిన్‌పేట్: ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


మూడుచింతలపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ జామురవి


దోమ: మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


బంట్వారం(కోట్‌పల్లి: ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్


ధారూరు: ధారూరులోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


పూడూరు: మన్నెగూడ చౌరస్తాలో ధర్నా చేస్తున్న మాజీ ఎంపీపీ మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి


బషీరాబాద్: అమ్మకోసం ఒక మొక్క కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

బషీరాబాద్, ఆగస్టు 22: 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద' అనే కార్యక్రమంలో భాగంగా స్థానిక తెలంగాణ మోడల్ స్కూల్‌లో గురువారం ఎంపీడీవో గాలి యాదయ్య నేతృత్వంలో విద్యార్థులు, అధికారులు పలువురు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అల్తామాస్ జహంగీర్, ఎంపీవో బాలగంగాధర్‌చారి, ఎంపీవో శారద, ఈసీ నర్సింహరెడ్డి, కార్యదర్శి జయకార్, ఐకేసీ ఈసీ సేవ్యానాయక్ పాల్గొన్నారు.

దోమ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతీ మొక్క తల్లితో సమానంగా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, వైద్యాధికారిణి రజిత, సిబ్బంది విజయలక్ష్మి, ఎంపీవో సోమలింగం, ప్రభులింగం, ఏపీవో దస్తయ్య, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, టీఏలు బాలయ్య, శ్రీనివాస్, వీరేంద్రబాబు, బాలమణి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: ప్రతీ ఒక్కరూ ఓ మొక్కను నాటి సంరక్షించాలని మర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పండరినాథ్ అన్నారు. కళాశాల ఆవరణలో, సాయిబాబా ఆలయం ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతో పాటు ప్రతీఒక్కరు బాధ్యతతో కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వీరేశం, రఘువీర్ దాస్, వెంకటయ్య, పెంటయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.


దోమ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటిన అధికారులు


మర్పల్లి: మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడాలి


చౌడాపూర్‌లో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ

కులకచర్ల, ఆగస్టు 22: బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడాలని చౌడాపూర్ మండల కేంద్రంలో గురువారం హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ప్రపంచ వ్యాప్తంగా హిందువులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. హిందూ ఐక్యవేదిక నాయకులు, వివిధ పార్టీల నాయకులు మాజీ జడ్పీటీసీ రాందాస్‌నాయక్, సుధాకర్‌రెడ్డి, అశోక్‌కుమార్, నాగ రాజు పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాగం అర్జున్

మేడ్చల్ టౌన్, ఆగస్టు 22: బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కార్యవర్గం సభ్యుడిగా మేడ్చల్‌కు చెందిన రాగం అర్జున్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం అర్జున్ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

పాఠశాలకు సహాయనిధి అందజేత

మేడ్చల్ టౌన్, ఆగస్టు 22: గుండ్లపోచంపల్లి పరిధి బాసురగడికి చెందిన సెయింట్ క్లారెట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం యుక్తా పరిశ్రమ యాజమాన్యం సాయమందించింది. స్థానికంగా ఉన్న యుక్తా పరిశ్రమ వారు గురువారం స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ బెన్నికి రూ.లక్షా 17వేల సహాయనిధి చెక్కును అందజేశారు. పాఠశాలలో చదువుతున్న సుమారు 52 మంది విద్యార్థులకు ఉపయోగ పడే ఫీజులు, లేదా ఇతర పుస్తకాలు, దుస్తులకు సహాయనిధిని అందజేసినట్లు తెలిపారు. యుక్త పరిశ్రమ చైర్మన్ శ్రేయాష్, కాంగ్రెస్ నాయకుడు సుధాకర్ పాల్గొన్నారు.

డ్రైవింగ్, మొబైల్ రిపేర్‌లో ఉచిత శిక్షణ

వికారాబాద్, ఆగస్టు 22: ఎస్‌బీఐ రూరల్ చిల్కూరు సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఉచిత శిక్షణ డ్రైవింగ్, మొబైల్ రిపేర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ సంచాలకులు కె.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు కారు డ్రైవింగ్, మొబైల్ రిపేర్, సీసీటీవీ ఏర్పాటుపై ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆగస్టు 27 నుంచి ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాలకు 850165190, 7981951167 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత


గుంతల్లో కంకర పోయిస్తున్న శ్రీనివాస్

బంట్వారం (కోట్‌పల్లి) ఆగస్టు 22: ఒగ్లాపూర్ గేట్ నుంచి ఇందోల్ గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలు పడడంతో గురువారం ఇందోల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ తన సొంత డబ్బులతో రోడ్డుపై ఉన్న గుంతలను కంకర వేసి గుంతలు పూడ్చాడు.

ముగిసిన రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


శామీర్‌పేట: ఆరాధన ఉత్సవాల్లో డాక్టర్ ఎస్‌వీఎల్ఎన్ మూర్తి పూజలు

శామీర్‌పేట, ఆగస్టు 22: తూంకుంట పరిధిలోని శ్రీగాయత్రి మహాక్షేత్రంలో గురువారం రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు, వాక్‌బ్రహ్మ శిష్యజనోద్ధారక డాక్టర్ ఎస్‌వీఎల్ఎన్ మూర్తి, బ్రహ్మణ వేదపండితులు శ్రీరామవేంద్రస్వామికి మంత్రోచ్ఛరణలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిర్మల్యవిసర్జన, ఫలపంచామృతాభిషేకం, పాదపూజ, కనకాభిషేకం, తులసి అర్చన, రథోత్సవం, పల్లకీసేవను భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు.

తాండూరు: తాండూరు పట్టణం చెనెగేష్‌పూర్ రోడ్డులో కొలువుదీరిన రాఘవేంద్ర స్వామి ఆలయంలో కొనసాగుతున్న ఆరాధన ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఈ ఉత్సవాలు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్ దంపతుల ఆధ్వర్యంలో కొనసాగాయి. ఉత్సవాల ముగింపు రోజున ఉదయం సుప్రభాతం, పాదపూజ, పంచామృతం, అష్టోత్తర పారాయణం, పల్లకీసేవ, రథోత్సవ కార్యక్రమాలు స్వామి వారి ప్రత్యేక అలంకరణలో కొనసాగాయి. అర్చకులు సురేంద్ర ఆధ్వర్యంలో బ్రహ్మణులు స్వామి వారిని పూలతో అలంకరించారు. చివరి రోజున పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మహిళలు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

24న వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసి అర్చన

కొడంగల్: ఈ నెల 24న శ్రావణమాసం 3వ శనివారాన్ని పురస్కరించుకొని కొడంగల్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 54వ వార్షిక లక్ష తులసి అర్చన నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు అందుకు తగిన రుసుము చెల్లించి తమ గోత్ర నామాలు రాయించాలని కోరారు. తులసి అర్చనలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి


ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్, శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 22: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ తెలిపారు. ఎదులాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఆయన మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డిలతో కలిసి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి హెచ్ఎం రాములుకు రూ.50లక్షల ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషిచేస్తున్నారని గుర్తుచేశారు. అందులో భాగంగానే ఎదులాబాద్ జిల్లా పరిషత్ పాఠశాల నూతన భవనానికి రూ.50లక్షల నిధులు కేటాయించారని తెలిపారు. పాఠశాలలో వసతిసదుపాయాల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధిపై సీఎం ప్రత్యేకదృష్టి సారించారని తెలిపారు. జిల్లాకు రూ.10కోట్ల నిధులు కేటాయిస్తే అందులో రూ.2కోట్లు పాఠశాలల అభివృద్ధికే కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు రాజేష్, జి.విశ్వనాథం, కె.కుమార్, జి.రవి, ఎస్.అమర్, ఎ.సుధాకర్‌రెడ్డి, ఎస్.బాలవెంకటేష్, ఎండీ ఇక్బాల్, ఎం.రమేష్, ఓంప్రకాష్, బి.రాజేందర్‌గౌడ్, వెంకటేష్, మల్లేష్‌యాదవ్, పి. బస్వయ్య, జంగయ్యయాదవ్, రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మా వెల్ఫేర్ పేరు చెప్పుకొని దందా చేస్తే సహించం


విలేకరులతో మాట్లాడుతున్న అబ్దుల్ హదీ

తాండూరు, ఆగస్టు 22: తమ ముస్లిం వెల్ఫేర్ పేరు చెప్పుకొని దందా చేస్తే సహించమని ముస్లిం వెల్ఫేర్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హదీ అన్నారు. తాండూరులో గురువారం అధ్యక్షుడు కుర్షీద్ హుస్సేన్, సంఘం సభ్యులతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. బైలా ప్రకారం రిజిస్ట్రేషన్ కలిగి సర్వహక్కులతో ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ తమ ఆధీనంలో కొనసాగుతోందన్నారు. కొంత మంది నిబంధనలకు విరుద్ధంగా ముస్లిం వెల్ఫేర్ పేరిట దుకాణం పెట్టి దందాలు కొనసాగిస్తున్నారని, వారిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసులు నమోదైనట్లు తెలిపారు. వారితో సంబంధం లేదని తమ సంఘం సభ్యులు నలుగురిని సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొనడం చట్ట విరుద్ధమన్నారు. తిరిగి వారిపై మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. 1997లో ఏర్పడిన ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ 2022లో రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. వక్ఫ్ బోర్డు సంబంధించిన ఆస్తులు దుకాణాల ద్వారా వచ్చే అద్దె ప్రభుత్వానికి చెందుతుందన్నారు. అయితే వక్ఫ్‌బోర్డు కమిటీ చైర్మన్‌గా తానే కొనసాగుతానని తెలిపారు. గత ఎమ్మెల్యేల ద్వారా సుమారు రూ.కోటి వరకు నిధులు మంజూరు చేయించి ఈద్గా, దుకాణాల సముదాయాలను అభివృద్ధి చేశామని తెలిపారు. పేదల సంక్షేమానికి ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేస్తే పట్టించుకోకుండా బైలాను విస్మరించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. తాము న్యాయపరంగా అన్నింటినీ ఎదుర్కొంటామన్నారు.

డీఎస్పీ అరుణ్‌కుమార్‌కు ఘన సన్మానం



డీఎస్పీని సన్మానిస్తున్న సుప్రభాత్ టౌన్‌షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 22 : సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ మెడల్ 2024ను అందుకున్న డీఎస్పీ అరుణ్‌కుమార్‌ను కాచవాని సింగారం, సుప్రభాత్ కాలనివాసులు ఘనంగా సన్మానించారు. గురువారం రాత్రి సుప్రభాత్ సంస్థ కమిటీ ఆధ్వర్యంలో డీఎస్పీ అరుణ్‌కుమార్ సన్మానం చేశారు. 1996 బ్యాచ్‌కు చెందిన అరుణ్‌కుమార్ పోలీసు విభాగంలో ఉత్తమ సేవలు అందించారని కాలనివాసులు కొనియాడారు. ఇటీవల ఇండియన్ పోలీసు 2024 అవార్డును సీఎం రేంత్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సుప్రభాత్ కాలని వెల్ఫేర్ అసోసియోషన్ కార్యదర్శి బాలకృష్ణరెడ్డి, కోశాధికారి రాము, కమిటి సభ్యులు హిందు పురం కమలాపతిరావు, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, శశిధర్ రెడ్డి, కాలనివాసులు తదితరులు పాలొన్నారు.

ఉపాధ్యాయుల హక్కులపై టీఎస్‌యూటీఎఫ్ పోరాటం


మోత్కుపల్లి ప్రభుత్వ పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ సంఘం సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

బంట్వారం (కోట్‌పల్లి) ఆగస్టు 22: ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడేది టీఎస్‌యూటీఎఫ్ సంఘం అని వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం అన్నారు. మండలంలోని మోత్కుపల్లి, బార్వాద్, కరీంపూర్, కంకణాలపల్లి, మల్‌శెట్టిపల్లి, రాంపూర్, కోట్‌పల్లి పాఠశాలలో గురువారం సంఘ సభ్యత్వం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.ప్రభాకర్, కోట్‌పల్లి మండల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు వెంకట్‌రెడ్డి, కె.రాజు, నర్సింహులు, రాజశేఖర్, వెంకట్ నరసింహారెడ్డి, గోపాల్, రామచంద్రయ్య, ఏ.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరాలి

- మెగా విద్యాసంస్థల చైర్మన్ నాగం మోహన్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న ఎదులాబాద్ మెగా విద్యాసంస్థల చైర్మన్ నాగం మోహన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 22: విద్యార్థులు క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధంగా చదివితేనే ఎంచుకున్న లక్ష్యాలను చేరుతామని మెగా విద్యాసంస్థల చైర్మన్ నాగం మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎదులాబాద్ మెగా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఓరియెంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించుకోవడానికి ప్రణాళికాబద్ధంగా చదివినప్పుడే విజయం సాధించగలమన్నారు. ఈ నాలుగేళ్ల సమయాన్ని వృథా చేసుకోవద్దని కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఇష్టపడి చదివి కన్న తల్లిదండ్రులకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెగా విద్యాసంస్థల వైస్‌చైర్మన్ కసిరెడ్డి మాలతి, డైరెక్టర్ నాగం సంజనారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సాయి వెంకటకృష్ణ, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను విభజించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, ఆగస్టు 22: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పార్లమెంటు ఎన్నికల్లో ఓటరు జాబితా ఆధారంగా పంచాయతీల ఓటరు జాబితాను వార్డుల వారీగా విభజించాలని ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. ఓటరు జాబితా విభజనపై పంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కార్యదర్శులు తయారు చేసిన ఓటరు జాబితాను 6.9.2024న గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, మండల పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డులపై ఉంచినట్లు తెలిపారు. వార్డుల విభజనలో ఓటరు పేరు తన వార్డులో రాకపోతే, అభ్యంతరాలు ఏమైనా ఉంటే 7.9.2024 నుంచి 13.9.2024 లోపు ఎంపీడీవో కార్యాలయంలో తెలిపేలా చూడాలన్నారు. అట్టి అభ్యంతరాలు 19.9.2024లోపు జిల్లా పంచాయతీ అధికారి పరిష్కరిస్తారని తెలిపారు. తుది ఓటరు జాబితాను 21.9.2024న ప్రచురించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాటు కాల్వ నిర్మాణ పనులు షురూ


ప్రారంభమమైన పాటు కాల్వ పనులు

బషీరాబాద్, ఆగస్టు 22: మండలంలోని భోజ్యానాయక్ తండాలో పాటు కాల్వ నిర్మాణం పనులు గురువారం ప్రారంభమయ్యాయి. తండా పక్కన వ్యవసాయ పొలాలు ఉండటంతో దిగువ భాగన వర్షాకాలం వరదనీరు ఉధృతంగా పారుతోంది. దీంతో తండాలోకి వరద నీరొచ్చి ఇళ్లు, అంతర్గత రోడ్లపై రోజుల తరబడి నిల్వ ఉండటంతో తండావాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో తండా పెద్ద, నవాంద్గీ సొసైటీ డైరెక్టర్ రుప్లానాయక్ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకున్నా సొంతంగా ఖర్చు చేస్తూ కాల్వ నిర్మాణం చేపడుతున్నారు. పనులు పూర్తయ్యాక నిధుల మంజూరుకు ఎమ్మెల్యేను కలిసి కోరుతానన్నారు. ఏళ్లుగా ఉన్న సమస్య తీరనుండటంతో తండా గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

కిక్కిరిసిన రైతువేదిక భవనం


రైతు వేదికలో రుణమాఫీ సమాచారం కోసం కిక్కిరిసిన రైతులు

బషీరాబాద్, ఆగస్టు 22: రుణమాఫీ కానీ వారితో బషీరాబాద్‌లోని రైతువేదిక భవనం గురువారం కిక్కిరిసింది. రెండు, మూడు రోజులుగా రైతులు పలువురు రుణ మాఫీ కాలేదంటూ వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తమకు రుణ మాఫీ ఎందుకు కాలేదంటూ ఏఈవోలను రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులు తీసుకున్న రుణం రూ.2లక్షల పైబడి ఉంటే మిగతా సొమ్ము కడితేనే రుణమాఫీ అవుతుందని ఏఈవోలు సమాధానమిస్తున్నారు. మా దగ్గర డబ్బులుంటే రుణం ఎందుకు తీసుకుంటామని ప్రశ్నిస్తున్నారు. ఒకేసారి పదుల సంఖ్యలో రైతులు అధికారుల వద్దకు వచ్చి గుమిగూడటంతో ఏంచేయాలో తెలియక రైతులు ఇచ్చిన దరఖాస్తులను తీసుకుంటూ ఎందుకు రుణమాఫీ కాలేదో వివరించారు.

క్రైం కార్నర్

స్కూటీ చోరీ

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 22: ఇంటి ముందు పార్కు చేసిన స్కూటీ చోరీకి గురైంది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రైం సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. అంకుశాపూర్‌కు చెందిన ఆట్ల రేష్మితరెడ్డి అనే విద్యార్థిని బుధవారం తన హోండా యాక్టీవా(టీఎస్ 11 ఈడీ 1557)ను మధ్యాహ్నం ఇంటి ముందు పార్కు చేసింది. సాయంత్రం 6 గంటలకు తిరిగి చూసేసరికి ఇంటి ముందు యాక్టీవా కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు క్రైం సీఐ తెలిపారు.